క్లుప్తంగా

తైక్వాండో పోటీల్లో బంగారు, రజత పతకాలు



తెనాలిఅర్బన్: టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో తెనాలికి చెందిన యూనిక్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు ఐదుగురికి బంగారు, ఒకరికి రజత పతకం లభించినట్లు కోచ్ జట్టు నాగరాజు తెలిపారు. పోటీలను వైఎస్సార్ కడప జిల్లాలోని శంఖారాపురం మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో శని, ఆదివారాల్లో నిర్వహించినట్లు చెప్పారు. పోటీల్లో నలుగురు బాలురు, ఇద్దరు బాలికలు పాల్గొన్నట్లు వివరించారు. వీరికి సోమవారం చెంచుపేటలోని అకాడమీలో పతకాలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవ అధ్యక్షుడు అందె బాల చంద్రమౌళి, విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు తెనాలి విద్యార్థులు



తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్ సబ్ జూనియర్ పోటీలకు తెనాలి కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు ధనాల తను శ్రీ, షేక్ హనీఫ్, లీల నాగేంద్రబాబు, యడ్ల తరణ్‌లు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌళాబీ తెలిపారు. అమలాపురంలో శని, ఆదివారాల్లో ఎంపిక నిర్వహించినట్లు చెప్పారు. వీరికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాదకుమారి, కొడాలి, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్లకు వృత్తి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ



భట్టిప్రోలు: పీఎం విశ్వకర్మ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన కార్పెంటర్లకు వృత్తి ధ్రువీకరణ పత్రాలను సోమవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరులో అందజేశారు. గత సోమవారం నుంచి శనివారం వరకు ఈ సెంటర్‌లో శిక్షణా తరగతులు జరిగాయి. సెంటర్ మేనేజర్ కోటి స్పందనా దేవి, ఏపీ వడ్రంగి అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోడూరు వెంకటేశ్వరరావులు ఈ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం స్పందనాదేవిని కార్పెంటర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగులతో రక్తహీనత



చావలి రామలక్ష్మి

భట్టిప్రోలు: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి చావలి రామలక్ష్మి సోమవారం పేర్కొన్నారు. రామలక్ష్మి మాట్లాడుతూ ఏడాది వయస్సు దాటిన వారికి ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా మంగళవారం నుంచి అందించనున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలోని విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు ఇస్తారని తెలిపారు. రక్త హీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం వంటి లోపాల నివారణకు ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రతి ఆరు నెలలకొకసారి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలి

రేపల్లె రూరల్: రేపల్లె నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అనధికారికంగా బెల్టుషాపులు నడుపుతున్నా.. అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించటం సిగ్గుచేటని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిలర్ ఆఫ్ పీపుల్ నేషనల్ కమిషన్ కో–ఆర్డినేటర్ పిన్ని సాంబశివరావు ఆరోపించారు. రేపల్లెలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బెల్టు దుకాణాలలో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా విక్రయిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ప్రతి గ్రామంలోని బెల్టు షాపులు నడుస్తున్నాయన్నారు. బెల్టుషాపులపై అధికారులు తక్షణ చర్యలు చేపట్టకపోతే హ్యూమన్ రైట్స్ తరఫున ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటంతో పాటు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. హ్యూమన్ రైట్స్ సభ్యులు కారుమూరి హనోక్‌బాబు, జుజ్జువరపు సురేష్, ఉప్పాళ్ల శ్రీకొండ తదితరులున్నారు.

ఇంధన పొదుపులో మేటి

ఇప్పటికే తెనాలి రైల్వేస్టేషన్‌కు జాతీయ గుర్తింపు



రైల్వేస్టేషన్లో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లు

తెనాలిరూరల్: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో తెనాలి రైల్వేస్టేషన్ ఇంధన పొదుపులో ఇతర స్టేషన్లకు ఆదర్శంగా నిలుస్తోంది. విద్యుత్ వాడకాన్ని తగ్గించి సోలార్ విద్యుత్ వినియోగిస్తూ ఏటా లక్షలాది రూపాయలు పొదుపు చేస్తోంది. తెనాలి రైల్వే స్టేషన్‌లో చేపట్టిన పలు ఇంధన పొదుపు చర్యలు రెండేళ్ల క్రితమే జాతీయ గుర్తింపు తెచ్చాయి. అత్యుత్తమ ఇంధన నిర్వహణ పద్ధతులకు గాను 2022 సంవత్సరంలో కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ, మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ శాఖల ఆధ్వర్యంలో ప్రకటించిన జాతీయ ఇంధన పొదుపు మెరిట్ సర్టిఫికెట్ తెనాలి రైల్వేస్టేషన్‌కు దక్కింది. అప్పట్లో జాతీయ స్థాయిలో తెనాలి నాలుగో స్థానం దక్కించుకోగా, విజయవాడ రైల్వే డివిజన్ స్థాయిలో మూడో స్థానం తెనాలి స్టేషన్‌కు దక్కింది.

ఇంధన పొదుపు ఇలా..

తెనాలి రైల్వేస్టేషన్ మీదుగా ప్రతి రోజు 80కు పైగా రైళ్లు వెళుతుంటాయి. అధికారుల అంచనా ప్రకారం రోజుకు సుమారుగా 16514 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రెండు ఎస్కలేటర్లు, మూడు లిఫ్టులు, ప్రయాణికులు వేచి ఉండే గదులు, వాటర్ కూలర్లు వంటి సౌకర్యాలు ఉన్నాయి. వీటితో పాటు తెనాలి రైల్వే స్టేషన్ ఎలక్ట్రికల్‌విభాగం ఆధ్వర్యంలో ఇంధన పొదుపుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్టేషన్ మొత్తం ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఎల్‌ఈడీ నేం బోర్డులు గ్లో సైన్ బోర్డులు, రోజుకు ఐదు వందల లీటర్ల నీటిని వేడి చేసే సోలార్‌వాటర్ హీటర్, 95 కిలో వాట్ల సామర్థ్యం గల సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్ అవసరాలకు ఈ సోలార్ ప్యానళ్ల వినియోగం ద్వారా ఏడాదికి 1,30,515 యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేస్తున్నారు.

60 శాతం విద్యుత్ వాడకం తగ్గింది



తెనాలి రైల్వే స్టేషన్‌లో ఇంధన పొదుపు కోసం చేపడుతున్న చర్యల కారణంగా సుమారు 60 శాతం విద్యుత్ వాడకం తగ్గింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అనేక చర్యలు తీసుకుంటున్నాం. అందుకనుగుణంగానే సోలార్ ప్యానళ్ల వినియోగం చేపట్టాం. పేపర్‌లెస్ టికెట్ల వినియోగాన్నీ ప్రోత్సహిస్తున్నాం. –టీవీ రమణ, రైల్వేస్టేషన్ మేనేజర్



ఇస్రోలో.. తెనాలి గజ్జెలు ఘల్లుఘల్లు

శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (ఇస్రో)లో భారతీయ శాస్త్రవేత్తలు జరుపుకొనే వినాయక చవితి మహోత్సవాలకు ఈ ఏడాది కూడా తెనాలిలోని శ్రీలక్ష్మి కూచిపూడి నృత్యకళా కేంద్రానికి ఆహ్వానం లభించింది. శనివారం జరిగిన ఈ వేడుకల్లో కళాకేంద్రం నిర్వాహకురాలు, నృత్యగురువు ఎ.వెంకటలక్ష్మి శిష్య బృందంచే నృత్య ప్రదర్శనకు అవకాశం కల్పించారు. వీరు వివిధ కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. ప్రదర్శన అనంతరం శిష్య బృందానికి జ్ఞాపికలను బహూకరించటమే కాకుండా, వారికి అంతరిక్ష కేంద్రంలో రాకెట్ విభాగాలను సందర్శించే అవకాశం కల్పించటం, వాటిగురించి విజ్ఞానపరమైన పరిచయం చేయటం సంతోషంగా ఉందని వెంకట లక్ష్మి తెలియజేశారు. – తెనాలి

పేదలకు దుప్పట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: విజయవాడలోని వరద ముంపు బాధితులకు తెనాలికి చెందిన ఫ్రూట్ మినిస్ట్రీస్, ఆర్కే ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం 200మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పాస్టర్ తుమ్మల ప్రశాంతరాజు, సభ్యులు దానియేల్, శేఖర్, బాలస్వామి, ఇర్మియా, సుధ, మేరి, కృపా, తదితరులు పాల్గొన్నారు.

- ఈరే మినిస్ట్రీస్ వ్యవస్థాపకరాలు లలితమ్మ జయంతిని పురస్కరించుకుని కంచర్లపాలెం గ్రామంలోని వృద్ధులకు, వితంతువులకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈరే మినిస్ట్రీస్, జై భీమ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బిషప్ సుధీర్ కుమార్, విజయవాడ ఎస్పీ శోభా మంజిరి, ఆర్టీసీ అధికారి కోటేశ్వరరావు, కఠెవరపు దేవానంద్, పేరం అరుణ, కఠెవరపు గోవా కుమారి, బాలరాజు, రామారావు పాల్గొన్నారు.

కర్లపాలెంలో వాహనాల తనిఖీ



కర్లపాలెం: మద్యం సేవించి వాహనాలు నడపటం నేరమని బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ చెప్పారు. సోమవారం కర్లపాలెం సెంటర్‌లో స్థానిక ఎస్ఐ ఎస్.రవీంద్రతో కలిసి సీఐ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ హరికృష్ణ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారందరూ రోడ్డు నిబంధనలు పాటించాలని చెప్పారు. వాహనాలకు సంబంధించిన పర్మిషన్లు బండి వద్దే ఉంచుకోవాలని, సంబంధిత అధికారులు అడిగినప్పుడు తప్పనిసరిగా వారికి చూపించాలని అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. వాహన తనిఖీలలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

భట్టిప్రోలు: దోమల నివారణకు భట్టిప్రోలు గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం ఫాగింగ్ నివారణ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ దారా రవి కిరణ్మయి ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన పున్నమ్మతో మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్ర

కర్లపాలెం: మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు ఆత్మహత్యాయత్నానికి యత్నించగా స్థానికుల సమాచారం మేరకు ఆమెను పోలీసులు కాపాడిన సంఘటన సోమవారం రాత్రి కర్లపాలెంలో చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర తెలిపిన వివరాల మేరకు చింతాయపాలెం గ్రామానికి చెందిన అంగిరేకుల పున్నమ్మ ఒంటరిగా నివాసం ఉంటుందని తెలిపారు. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నప్పటికీ వారు వేరే గ్రామాల్లో ఉండటంతో ఆమె బాగోగులు బంధువులు చూస్తున్నారని ఆయన తెలిపారు. మతిస్థిమితం లేని పున్నమ్మ సోమవారం రాత్రి కర్లపాలెంలోని తుంగభద్ర కాలువలో దూకేందుకు ప్రయత్నించగా ఆక్వా రైతులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ గమనించి ఆమెను కాలువలో దూకకుండా నిలువరించి తమకు సమాచారం అందించటంతో సిబ్బందిని పంపి ఆమెను స్టేషన్‌కు రప్పించామన్నారు. ఈ విషయమై ఆమె కుమారుడికి తెలియజేసి పున్నమ్మను బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

శాశ్వత డ్రెయినేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి

భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి



కిష్కిందపాలెంలో మాట్లాడుతున్న డి.రమాదేవి

కొల్లూరు: లంక గ్రామాలకు శాశ్వత డ్రెయినేజ్ ఏర్పాటు చేసి ప్రజలను, రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కిష్కిందపాలెంలో రైతు సంఘం ఆధ్వర్యంలో లంక గ్రామాల రైతులతో శాశ్వత డ్రెయినేజ్ ఏర్పాటు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, కృష్ణా నది వరదల వల్ల లంక గ్రామాలకు చెందిన రైతులు రూ.కోట్లు విలువ చేసే పంటలను నష్టపోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సంభవించిన వరదలు తగ్గిన అనంతరం వరద నీరు బయటకు వెళ్లేందుకు డ్రెయినేజ్ వ్యవస్థ లేకపోవడం కారణంగా పంట నష్ట తీవ్రత మరింత పెరిగిందన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం చొరవ తీసుకొని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని పోతార్లంక నుంచి పెసర్లంక వరకు శాశ్వత డ్రైనేజ్ ఏర్పాటు చేయడం కోసం కృషి చేయాలని కోరారు. డ్రెయినేజ్ వ్యవస్థ కోసం 2010లో డ్రెయినేజ్, ఇరిగేషన్ అధికారులు తయారుచేసిన డీపీఆర్ రిపోర్టును అమలు కోసం అధికారులు కృషి చేయాలన్నారు. డ్రెయినేజ్ వ్యవస్థ ఏర్పాటుకు రైతుల నుంచి భూమి సేకరించాల్సి వస్తే రైతులకు నష్టపరిహారం చెల్లించి భూ సేకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటుక బట్టీల వ్యాపారుల అక్రమ మట్టి తవ్వకాల కారణంగా రోడ్లు, వ్యవసాయ భూములు కోతలకు గురువుతున్నాయని, అక్రమ తవ్వకాలపై తగిన చర్యలు చేపట్టాలని కోరారు. సదస్సు చివరిలో రైతులందరూ రాజకీయాలాకు అతీతంగా ఐక్యంగా ఉండి శాశ్వత డ్రెయినేజ్ ఏర్పాటుకు కృషిచేయాలని తీర్మానించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తోకలవారిపాలెం సర్పంచి టి.కృష్ణమోహన్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జొన్నా శివశంకర్, రైతు సంఘం నాయకులు బీఎల్‌కే ప్రసాద్, కె.రామస్వామి, ప్రజాసంఘాల నాయకులు బి.సుబ్బారావు, పి.మనోజ్, నాగరాజు, వ్యాపారవేత్త వేములపల్లి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పంటనష్టం అంచనా జాబితా విడుదల

వేమూరు: నియోజకవర్గంలో పంటనష్టం అంచనా జాబితాలు సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి ప్రదర్శనకు ఉంచడం జరుగుతుందని రేపల్లె వ్యవసాయ డివిజన్ అధికారి ఆర్.విజయబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో రైతులు, కౌలు రైతులు 77,832 ఎకరాల్లో వరి సాగు చేశారన్నారు. ఈ నెలలో కురిసిన భారీ వర్షాలు వల్ల 22,992 ఎకరాలు దెబ్బతినట్లు ఆయన తెలిపారు. వీఆర్వో, గ్రామ వ్యవసాయాధికారి, మండల వ్యవసాయాధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్ట పోయిన ప్రతి రైతును గుర్తించడం జరిగిందన్నారు. రైతులు, కౌలు రైతులు పంటనష్టం అంచనా జాబితాలు పరిశీలించి, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. అభ్యంతరాలను స్వీకరించి తుదిజాబితా బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించడం జరుగుతుందన్నారు.

సెలవునాడు తరగతులు నిర్వహించడం బాధాకరం

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్

తెనాలిఅర్బన్: మీలాద్ ఉన్ నబి పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించినప్పటికి తెనాలి పట్టణంలోని పలు కార్పొరేట్ విద్యాసంస్థలు, కళాశాలలు తరగతులు నిర్వహించడం బాధాకరమని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం తరగతులు నిర్వహిస్తున్న పలు కళాశాలలను మూయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతులు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెలవు దినాల్లో విద్యాసంస్థలు నిర్వహించవద్దని ప్రభుత్వం ఎన్ని సార్లు హెచ్చరించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇలాంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండు శివ, నాయకులు మద్దినేని కిరణ్‌బాబు, చెన్నూరి సాయి, భూమేష్, అఖిల్, తేజ, పండు, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా గణేష్ లడ్డూ వేలంపాట



లడ్డూతోపాటు దక్కించుకున్న బంగారు నెక్లెస్‌ను చూపుతున్న గోపాలరావు దంపతులు

తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని మెడికల్ కాంప్లెక్స్ నవమ గణపతి మహోత్సవాలను తొమ్మిది రోజుల పాటు వైభవంగా జరిగాయి. స్వచ్ఛమైన బంక మట్టితో భారీ గణనాథుడి విగ్రహాన్ని రూపొందించి, ప్రకృతి రూపంలో ఉండేలా ప్రతిమ నిండుగా గరికతో సహా ప్రతిష్ఠించటం ప్రత్యేక ఆకర్షణ. తొమ్మిదో రోజైన ఆదివారం రాత్రి విశేష పూజలు చేశారు. స్వామివారి లడ్డూ ప్రసాదాల వేలం నిర్వహించారు. ముందుగా స్వామివారి మహాప్రసాదం (36 కిలోల లడ్డు)ను వేలంపాటలో శ్రీధర్ మెడికల్ డిస్ట్రిబ్యూటర్ తాడిపత్రి గోపాలరావు రూ.2.80 లక్షలకు దక్కించుకున్నారు. నిర్వాహకులు లడ్డూతోపాటు డీడీ బాస్‌తో తయారుచేసిన 30 గ్రాముల బంగారు నెక్లెస్‌ను గోపాలరావు దంపతులకు అందజేశారు. కుబేర హుండీ, 10 కిలోల కుబేర శివలింగ లడ్డూను లక్ష్మీసాయి ట్రేడర్స్ యజమాని రూ.30 వేలకు దక్కించుకున్నారు. స్వామి పాదాల చెంత ఉంచిన మరో అయిదు కిలోల లడ్డూ, 50 గ్రాముల వినాయకుని వెండి విగ్రహాన్ని విశాలాక్షి మెడికల్స్ నాళం సుబ్రహ్మణ్యం రూ.35,700లకు దక్కించుకున్నారు. మూడు కిలోల లడ్డూను శ్రీపద్మావతి ఫార్మస్యూటికల్స్ నాగేంద్ర పాడారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ బింగుమళ్ల పద్మీ పర్యవేక్షించారు.

వైభవంగా ఆరంభమైన పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాల్లో అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్లో వేంచేసి ఉన్న శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజున వైఖానస ఆగమం ప్రకారం అష్టోత్తర శతకలశాభిషేకం, సాయంత్రం అంకురార్పణ, పవిత్ర అధివాస కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. మంగళవారం సుదర్శన హోమం జరుగుతుందని, 18న పవిత్ర విసర్జన, పూర్ణాహుతి, తిరుప్పావడ సేవ జరుగుతాయని ఆలయ ఈవో అవుతు శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆలయం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్, సురేష్, శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన సేవాసమితి సభ్యులు గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, జంధ్యం రామారావు, మదుపల్లి చంద్రోశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డపనేని ఇందిర వర్ధంతి



వహాబ్‌చౌక్‌లో ఇందిర విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ మహిళా రాజకీయ నేత దొడ్డపనేని ఇందిర 38వ వర్ధంతిని సోమవారం ఆమె అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణ వహాబ్‌చౌక్, అయితానగర్‌లోని ఇందిర విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. ఆమె సేవలను స్మరించుకున్నారు. రాజకీయ ప్రముఖుడు, మాజీ మంత్రి ఆలపాటి వెంకట్రామయ్య కుమార్తె అయిన దొడ్డపనేని ఇందిర తండ్రి బాటలోనే తెనాలి అసెంబ్లీకి మూడు పర్యాయాలు పోటీచేసి గెలిచారని గుర్తుచేసుకున్నారు. అందులో ఒక పర్యాయం ఇండిపెండెంట్‌గా పోటీచేసి నెగ్గటం విశేషమన్నారు. తర్వాత గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గానూ ప్రత్యక్ష ఎన్నికల్లో విజయం సాధించారని చెప్పారు. డాక్టర్ గుమ్మడి సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొడాలి ఆదిలక్ష్మి శ్రీనివాసరావు, కన్నెగంటి మురళీకృష్ణ, నేలటూరి బెన్ను, ఈదర వెంకట పూర్ణచంద్, ఆలపాటి వెంకట్రామయ్య, రాజశేఖరరెడ్డి, కొగంటి అక్కయ్యబాబు, గిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగరాజుకు పలువురు అభినందనలు



పల్నాటి నాగరాజుకు సత్కారం

తెనాలి: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ కార్యదర్శి పల్నాటి నాగరాజు జాతీయస్థాయి రాజకీయ పార్టీ రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేద్కర్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు సోమవారం అభినందనసభ ఏర్పాటు చేశారు. స్థానిక దేవీచౌక్‌లోని కమ్యూనిటీ హాల్లో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ సుభాని, చాటగడ్డ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సభలో పల్నాటి నాగరాజును సత్కరించారు. ప్రజాసమస్యలు, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడతారన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. వారి హక్కుల కోసం పోరాడాలని ప్రసాద్ గారు తెలియపరిచారు. నిరుపేద కుటుంబంలో జన్మించి, తన సేవలతో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికవటం గర్వకారణమన్నారు. బ్రాహ్మణ పరిషత్ కార్యవర్గ సభ్యుడు జూపూడి ప్రవీణ్‌కుమార్, ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు గోపి, అనిల్, ఏసు తదితరులు పాల్గొన్నారు

40 మంది ప్రైవేట్ ఉపాధ్యాయులకు కిట్ల పంపిణీ



భట్టిప్రోలు: బాపట్ల జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో రూ.1.08 లక్షలు వసూలు చేసి వరద ముంపు గ్రామాలకు చెందిన 40 మంది ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు సోమవారం నిత్యావసర వస్తువులు, దుస్తుల కిట్లను అందజేశారు. భట్టిప్రోలు మండలం పెసర్లంక స్వాతి ఇంగ్లిష్ స్కూల్‌లో వీటిని అందజేశారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- వ్యక్తికి స్వల్పగాయాలు
- మరో వ్యక్తిపై రాయితో దాడి

భట్టిప్రోలు: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారులు ఒకరికొకరు ఢీకొనడంతో ఓ యువకుడికి గాయాలు కాగా ప్రతిగా ఆ వ్యక్తి ఢీకొట్టిన యువకుడిని కులం పేరుతో దూషించి తలపై రాయితో కొట్టిన సంఘటన ఇది. ఎస్ఐ ఎం.శివయ్య కథనం ప్రకారం ఆదివారం రాత్రి భట్టిప్రోలుకు చెందిన మేడూరి గిరిధర్, గౌతమ్‌లు ఓ ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా మంద్రు వెంకటేష్ అనే యువకుడు ఒకరికొకరు ఢీకొనడంతో గిరిధర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. గిరిధర్, గౌతమ్‌లు కలసి వెంకటేష్‌ను కులం పేరుతో దూషిస్తూ, రాయితో తలపై మోదారు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు తెనాలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.